క్లుప్తంగా

సీఐగా అశోక్‌రెడ్డి బాధ్యతలు స్వీకరణ



నాగర్‌కర్నూల్ క్రైం: నాగర్‌కర్నూల్ సీఐగా అశోక్‌రెడ్డి శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. రాచకొండ కమిషనరేట్ నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ కనకయ్య గౌడ్ కమిషనరేట్‌కు బదిలీ అయ్యారు. అనంతరం సీఐ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. శాంతిభద్రతల విఘాతం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. పలువురు సిబ్బంది సీఐకి పూలబొకె ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

ఐకాన్ అవార్డు గ్రహీతకు సన్మానం



చారకొండ: సామాజిక సేవలకు గుర్తింపుగా ఇటీవల హైదరాబాద్‌లోని విశ్వా ఆర్ట్స్ కళాక్షేత్రం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని జేపల్లి గ్రామానికి చెందిన వెల్జాల వెంకటేష్‌కు ఐకాన్ అవార్డు వరించింది. అవార్డు అందుకున్న సందర్భంగా శుక్రవారం జేపల్లిలో మాజీ సర్పంచ్ రవీందర్, నాయకులు ,గ్రామ యువకులు, తదితరులు వెంకటేష్‌ను శాలువాతో సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో యువకులు మున్నా నాయక్, జైపాల్, వెంకటయ్య, సీతారాములు, రమేష్, వెంకటేష్, పరశురాం, ప్రశాంత్‌మునిరామ్, గ్రామస్తులు, యువత తదితరులు ఉన్నారు.

పాఠ్యపుస్తకాలు సీజ్

కందనూలు: జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలో ఓ ప్రైవేట్ పాఠశాల సముదాయంలోని ఓ షాపులో శుక్రవారం పాఠ్యపుస్తకాలు అమ్ముతున్నట్లు మున్సిపల్ అధికారులకు స్థానికులు సమాచారం అందించారు. ఈ మేరకు అధికారులు పాఠశాలకు చేరుకొని తనిఖీ నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు విక్రయించడంతో దుకాణాన్ని సీజ్ చేశారు.

30 వరకు రేషన్ బియ్యం పంపిణీ

కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లాలోని రేషన్ కార్డు లబ్ధిదారులకు రేషన్ బియ్యం ఈ నెల 30వరకు మూడు నెలలకు సంబంధించిన బియ్యం పొందవచ్చని జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పేరు నమోదు చేసుకోండి

కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఆర్టీసీ డిపోల పరిధిలోని రిటైర్డ్ ఉద్యోగులు ఈ నెల 25వ తేదీ నుంచి పాలెం బస్‌స్టేషన్‌లో ఆర్టీసీ డిస్పెన్సరీలో ఫొటో ఐడెంటిటీ ప్రోగ్రాం నిర్వహిస్తునట్లు జిల్లా ఆర్టీసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ నిరంజన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగులతో పాటు సతీమణులతో హాజరై ఫొటో ఐడెంటిటీలో పేరు నమోదు చేసుకోవాలని కోరారు.

బాలికలు చదువుపై దృష్టి సారించాలి

పాన్‌గల్: కస్తూర్బా విద్యాలయంలో చదువుతున్న బాలికలు ప్రభుత్వం కల్పించిన వసతులను సద్వినియోగం చేసుకుంటూ చదువుపైనే దృష్టి సారించి మంచి ఫలితాలు సాధించాలని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం సాయంకాలం మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయం బాలికలు, ఉపాధ్యాయ బృందంతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. హాస్టల్స్‌లో ఉండటం బాలికలకు ఒక సువర్ణ అవకాశమని, ఇక్కడ తోటి బాలికలతో సహజీవనం, సర్దుబాటు, భిన్నమైన సంస్కృతులను నేర్చుకోవడం సాధ్యమవుతుందన్నారు. విద్యాలయంలో బోధన సిబ్బంది నుంచి ఒక కౌన్సిలర్‌ను ఏర్పాటు చేస్తూ ఏదైనా సమస్య ఉంటే బాలికలు కౌన్సిలర్ దృష్టికి తీసుకరావాలని సూచించారు. సమావేశంలో ఎస్ఓ హేమలత, ఉపాధ్యాయ బృందం, బాలికలు పాల్గొన్నారు.

ఎస్ఐని కలిసిన బీఆర్ఎస్ నాయకులు



కోడేరు: మండల కేంద్రానికి ఇటీవల నూతనంగా వచ్చిన ఎస్ఐ జగదీశ్వర్‌ను బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం ఆయనను కలిశారు. అనంతరం ఆయనకు పుష్పగుచ్ఛం అందించారు. ప్రతి ఒక్కరు శాంతి భద్రతలకు సహకరించాలని ఎస్ఐ కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు శ్రీశైలం, యూత్ అధ్యక్షుడు మిద్దె రాజు, యాపచెట్టు లాలు, మాజీ వార్డు సభ్యులు బాలస్వామి, ఆనంద్, సాయిబాబు, డ్యాగ బాలస్వామి పాల్గొన్నారు.

బీళ్లుగా పంట పొలాలు

- పెరిగిన కోతుల బెడద
- సాగుకు ఆసక్తిచూపని రైతన్నలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



మన్ననూర్‌లో బీళ్లుగా కనిపిస్తున్న వ్యవసాయ భూములు

మన్ననూర్: వానాకాలం ప్రారంభమై నెల గడుస్తున్నా పంటలు సాగుచేసేందుకు రైతులు ముందుకు రావడం లేదు. తొలకరి వర్షాలు పలకరించినా రైతన్నలు వెనకంజవేస్తున్నారు. వర్షాలు కురిస్తే పంటపొలాల్లో రైతన్న బిజీబిజీగా గడుపుతారు కాని అమ్రాబాద్ మండలంలో పలు గ్రామాల్లో రైతులు పొలాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. కోతుల, వన్యప్రాణుల బెడద అధికం కావడంతో పొలాల బాట పట్టడం లేదు.

పలు గ్రామాల్లో..

దీంతో పంట పొలాలు బీళ్లుగా దర్శనమిస్తున్నాయి. మండలంలోని మాచారం, వెంకటేశ్వర్లబావి, తుర్కపల్లి, వటువర్లపల్లి, సార్లపల్లి, కుడిచింతలబైలు తదితర గ్రామాల్లో కూడా ఇదే పరిస్థితి. ఆయా గ్రామాల్లో అధిక శాతం రైతులు వర్షా ఆధారిత వ్యవసాయంపైనే ఆధార పడి పంటలు సాగు చేస్తుంటారు. ప్రస్తుతం మన్ననూర్ గ్రామంలో సుమారు 1,950 ఎకరాల భూమి వ్యవసాయం సాగుకు అనుకూలంగా ఉంది. గ్రామాల్లో పగటి పూట కోతులు, రాత్రి సమయంలో అడవి పందులు, జింకలు, దుప్పుల బెడద రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. కొందరు రైతులు పంటలు సాగు చేస్తే కోతులు ధ్వంసం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీస దిగుబడి కూడా రాకపోగా పెట్టుబడులు మీద పడుతుండటంతో రైతులు సాగుకు దూరం అవుతున్నారు. ఇదిలా ఉంటే మన్ననూర్ గ్రామంలో మనుషుల జనాభా కంటే కోతులే అధికం కావడంతో ఇంట బయట వీటితో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కోతులు, అడవి జంతువులను వ్యవసాయ పొలాల్లోకి రాకుండ ప్రభుత్వం, సంబంధిత అటవీశాఖ అధికారులు కట్టడి చేస్తేనే వ్యవసాయం సాగే పరిస్థితి. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, సాగుకు అనుకూల పరిస్థితులు కల్పించాలని రైతులు కోరుతున్నారు. సాగుపై పాలకులు సమాలోచనలు చేయడంతో పాటు వ్యవసాయ ప్రోత్సాహాలతో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి వ్యవసాయ రంగానికి పూర్వ వైభవం తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఏటా పంట నష్టాలే..



వర్షాధారంతో పండిస్తున్న పంటలు ఇప్పటికి సుమారు 3–4 ఏళ్లుగా నష్టాలే చవిచూడాల్సిన పరిస్థితి. అంతంత మాత్రంగా పండే పంటలకు కోతులు, అడవి, ఊర పందుల బెడద తీవ్రంగా ఉంది. గతేడాది నాలుగు ఎకరాల్లో కంది, ఆముదం, పత్తి పంటలు సాగు చేస్తే కనీసం పెట్టుబడులు కూడా రాలేదు. ఇప్పటికీ అప్పు తీరలేదు. ఈ ఏడాది సాగు చేయడం లేదు.

– మంతటి శ్రీనివాసులు, రైతు, మన్ననూర్

రైతులు ముందుకు రావడం లేదు



వానాకాలంలో పంటలు సాగు చేసేందుకు రైతులు ముందుకు రావడం లేదు. కోతులు, అడవి జంతువుల బెడద కారణంగా రైతులు ఇబ్బంది పడుతున్నారు. గ్రామాల్లో పర్యటించి పంటల సాగు, ప్రభుత్వం కల్పించే ప్రోత్సాహకాల గురించి రైతులకు తెలియజేస్తున్నాం. ఎంత చెప్పినా వినిపించుకోవడం లేదు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

–మహేష్‌రెడ్డి, ఏఓ అమ్రాబాద్

ప్రతి పల్లెకు బీటీరోడ్డు సౌకర్యం



చంద్రాయన్‌పల్లిలో బీటీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి

చారకొండ: అచ్చంపేట, కల్వకుర్తి నియోజకవర్గాల్లోని ప్రతి పల్లెకు బీటీ రోడ్డు సౌకర్యం కల్పించడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యేలు చిక్కుడు వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం చారకొండ మండలంలోని చంద్రాయన్‌పల్లి, గోకారం, తుర్కలపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ముందుగా రూ. 4.50కోట్లతో చారకొండ–చంద్రాయన్‌పల్లి బీటీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం రూ. 4.60 కోట్లతో తుర్కలపల్లి–గోకారం మార్గంలో వంతెన నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యంలో గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పల్లెలు, తండాలకు ఉన్న మట్టిరోడ్లను బీటీగా మార్చడంతో పాటు ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు పెద్దఎత్తున నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి.. సొంతింటి కలను సాకారం చేస్తామన్నారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ బాలాజీ సింగ్, మాజీ జెడ్పీటీసీ వెంకట్‌గౌడ్, మాజీ ఎంపీపీ వసంత, సాంబయ్యగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాల్‌రాంగౌడ్, డీసీసీ కార్యదర్శి మహేందర్, మాజీ ఉపసర్పంచ్ పర్వతాలు, నాయకులు ఎస్.రాములుయాదవ్, సహదేవ్, శంకర్, వెంకటయ్యగౌడ్, దశరథం పాల్గొన్నారు.

జర్నలిస్టుల దీక్షకు ప్రజాసంఘాల సంఘీభావం



దీక్షలో కూర్చున్న జర్నలిస్టులు

కొల్లాపూర్: ఇళ్ల స్థలాలు కేటాయించాలని, పక్కా ఇళ్లు మంజూరు చేయాలని జర్నలిస్టులు చేపట్టిన నిరాహార దీక్ష మూడోరోజు శుక్రవారం కొనసాగింది. పలు ప్రజా సంఘాల నాయకులు దీక్షలకు సంఘీభావం ప్రకటించారు. దీక్షా శిబిరంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ కృష్ణ, జిల్లా అధ్యక్షుడు ఎస్.రాంచందర్‌లు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం భూ కేటాయింపులు జరిగాయని, వాటిలో అర్హులైన జర్నలిస్టులకు ప్లాట్లు కేటాయించాలని కోరారు. దీక్షలో టీడబ్ల్యూజేఎఫ్ నియోజకవర్గ కన్వీనర్ జలకం మద్దిలేటి, నాయకులు కురుమయ్య, సీపీ నాయుడు, ఎస్‌పీ మల్లికార్జున్, రమణ, కారంగి గోవిందు, కేశవులు, పెరుమాళ్ల స్వాములు, జల్లాపురం సురేందర్ ఉన్నారు.

పంచాయతీ కార్మికుల అరెస్ట్



కోడేరులో పోలీసుల అదుపులో పంచాయతీ కార్మికులు

నాగర్‌కర్నూల్ రూరల్: పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్‌లో చలో హైదరాబాద్ కార్యక్రమానికి బయలుదేరుతున్న గ్రామ పంచాయతీ కార్మికులను శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు కురుమయ్య మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 11759 గ్రామ పంచాయతీలలో దాదాపు 50 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారన్నారు. మూడు నెలలుగా జీతాలు ఇవ్వకపోతే ఎలా బతుకుతారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. శాంతయ్య, కృష్ణయ్య, బాలస్వామి, సురేష్, నరేష్, మురళి, రవి, సుధాకర్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జీతాలు వెంటనే చెల్లించాలి

కోడేరు: గ్రామ పంచాయతీలో పని చేస్తున్న కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో పంచాయతీ రాజ్ కమిషన్ ప్రధాన కార్యాలయం ముట్టడికి వెళ్తున్న కార్మికులను శుక్రవారం పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సాయిబాబు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

అచ్చంపేట రూరల్: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం పట్టణంలో న్యూ మాస్టర్ మైండ్స్ జూనియర్ కళాశాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. పట్టణంలో మొదటిసారి కంప్యూటర్ విద్యను ప్రారంభించినందుకు యాజమాన్యాన్ని ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్క నాటారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రజిత, గోపాల్‌రెడ్డి, చంద్రమోహన్, గౌరీశంకర్, రఘురాం, కళాశాల చైర్మన్ పాండు, కార్యదర్శి వెంకట్, ప్రిన్సిపాల్ మహేష్, కళాశాల అధ్యాపకబృందం పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్యం



పెద్దకొత్తపల్లి: ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందుతుందని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రిలో అందుతున్న సేవలను వైద్యాధికారి డాక్టర్ అనూషను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో కాన్పుల సంఖ్యను పెంచాలని సూచించారు. శిథిలావస్థకు చేరిన ఆస్పత్రి భవనాన్ని పరిశీలించారు. ఆస్పత్రి భవనం పైకప్పు పెచ్చులూడుతుండటంతో ప్రమాదకరంగా ఉందని ఆ గదులల్లో రోగులకు వైద్యం చేయొద్దని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



తిమ్మాజిపేట: పరిసరాలను పరిశుభ్రంగా చేసుకోవాలని ఎంపీడీఓ లక్ష్మీదేవి సూచించారు. మండలంలోని మరికల్‌లో శుక్రవారం ఎంపీడీఓ, ఏఈ, పంచాయతీ కార్యదర్శి తదితరులు గ్రామానికి వెళ్లి పలు ఇళ్లకు వెళ్లి పరిసరాలను పరిశీలించారు. నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. ఇంటి సమీపంలో మట్టికుండలు, ప్లాస్టిక్ బకెట్‌లలో నీరు నిల్వ ఉంచితే దోమలు ఆవాసాలు ఏర్పర్చుకుంటాయన్నారు. చుట్టుపక్కల చెత్త చెదారం ఉండకుండా చూసుకోవాలన్నారు. అదేవిధంగా గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎంపీడీఓ భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్రామ్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ మహ్మద్ యూసుఫ్, పంచాయతీ కార్యదర్శి యాదయ్య, ఆశవర్కర్, లబ్ధిదారులు ఉన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న డీహెచ్‌పీఎస్ నాయకులు

తాడూరు: దళితుల అభ్యున్నతి, దళితవాడల అభివృద్ధి కోసం డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ జయంతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు భరత్, కేవీపీఎస్ జిల్లా కాశన్నలు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను దళితుల అభివృద్ధికి వినియోగించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పక్కదారి పట్టిస్తున్నాయని విమర్శించారు. ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలు ఇవ్వకుండా నిరుద్యోగులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. రాజకీయ పార్టీలు దళితులను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నాయని వాపోయారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లక్ష్మన్ యాదయ్య, శాంతయ్య, వెంకటయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఆషాఢమాసం ప్రత్యేక పూజలు



అచ్చంపేట: పట్టణంలోని శ్రీచక్ర సహిత వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వాసవీ మాత అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు ఒడిబియ్యం కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ, పసుపు, గాజులు, కొబ్బరి కుడుకలు, పట్టుచీర, తలంబ్రాలు సమర్పించారు.

రోడ్డుపై నాట్లు వేసి నిరసన



నాగర్‌కర్నూల్ రూరల్: మున్సిపల్, ఆర్అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ శుక్రవారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఎదురుగా రోడ్డుపై ఉన్న నీటిలో వరినాట్లు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి పొదిల రామయ్య మాట్లాడుతూ జిల్లాలో రోడ్లు గుంతలమయంగా మారయన్నారు. అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. రహదారిపై ఏర్పడి గోతులను పూడ్చడంలో మున్సిపల్, అర్అండ్‌బీ అధికారులు విఫలం అయ్యారని ఆరోపించారు. జిల్లా నాయకులు అంతటి కాశన్న, శివ, వెంకటేష్, కురుమయ్య, సుధాకర్, కురుమూర్తి, శివయ్య, అంజి, రవీంద్ర, ఆంజనేయులు, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఫార్మర్ రిజిస్ట్రేషన్



తిమ్మాజిపేట: మండలంలోని పలు గ్రామాల్లో ఫార్మర్ రిజిస్ట్రేషన్ ముమ్మరంగా కొనసాగుతోందని ఏఓ కమల్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని మరికల్‌లో రైతుల భూమి రిజిస్ట్రేషన్‌ను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మండలంలోని ప్రతి గ్రామంలో రైతులు తమ భూములను ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రైతులు తమ పట్టా పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, ఫోన్ తీసుకొని రైతు వేదిక కేంద్రాల వద్దకు రావాలన్నారు. రైతులు సహకరించాలని కోరారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



చారకొండలో ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేస్తున్న ఏడీఏ చిన్న హుస్సేన్ యాదవ్



తెలకపల్లిలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏఓ నర్మద

తెలకపల్లి: నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏఓ నర్మద హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని మనగ్రోమోర్, శతాక్షి ఎరువుల మందుల దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల నమునాలను సేకరించి ప్రయోగశాలకు పంపించారు. అనంతరం ఏఓ మాట్లాడుతూ ఎరువుల నమూనాలు వాటి ప్రమాణాలు డీలర్లు ధ్రువీకరణ పత్రాలు సరి చూసుకోవాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు రసీదులు ఇవ్వాలన్నారు. సిబ్బంది, డీలర్లు ఉన్నారు.

ఏడీఏ తనిఖీ

చారకొండ: రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ చిన్న హుస్సేన్ యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో ఏఓ తనూజరాజ్‌తో కలిసి ఫర్టిలైజర్ దుకాణాలను ఆయన తనిఖీ చేసి విత్తనాలు, ఎరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ దుకాణాల ఎదుట స్టాక్ బోర్డులు ప్రదర్శించాలని సూచించారు. పెంట్లవెల్లి ఏఓ వికాస్, డీలర్లు తదితరులు ఉన్నారు.

రైతులకు రశీదులు ఇవ్వాలి

వెల్దండ: ఫర్టిలైజర్, పెస్టిసైడ్ దుకాణాల్లో కొనుగోలు చేసిన ఎరువులు, విత్తనాలకు సంబంధించిన రశీదులను తప్పనిసరిగా ఇవ్వాలని ఏఓ శోభారాణి డీలర్లకు సూచించారు. మండలంలోని పెద్దాపూర్, కుప్పగండ్ల, రాచూర్ తదితర గ్రామాల్లోని ఫర్టిలైజర్ దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు సాగుచేసే పంటల్లో నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవాలన్నారు. అనంతరం ఆయా దుకాణాల్లో విత్తనాలను సాంపిల్స్ సేకరించారు. కార్యక్రమంలో ఆయా ఫర్టిలైజర్ షాపుల డీలర్లు, రైతులు తదితరులు ఉన్నారు.

కుడికిళ్ల విద్యార్థి ప్రతిభ



కొల్లాపూర్: మండలంలోని కుడికిళ్ల గ్రామానికి చెందిన విద్యార్థి మంగదొడ్డి అంకిత్ యాదవ్ గురువారం ఇండియన్ ఎయిర్ ఫోర్స్ పరీక్ష ఫలితాలలో ఆల్ ఇండియా 384 ర్యాంకు సాధించారు. దేశవ్యాప్తంగా 8 లక్షల మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లా కలిగిరి సైనిక్ స్కూల్‌లో 6వ తరగతి నుంచి 12 తరగతి వరకు విద్యార్థి విద్య అభ్యసించాడు. గ్రామస్తులు, విద్యార్థి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

రేపు బొడ్రాయి పండగపై అభిప్రాయ సేకరణ

మన్ననూర్: గ్రామంలో బొడ్రాయి పండగ నిర్వహణపై ఈ నెల 29వ తేదీన ఉదయం 10 గంటలకు స్థానిక శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం ప్రాంగణంలో అభిప్రాయ సేకరణపై సమావేశం నిర్వహిస్తునట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు పులిజాల శేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరై సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.

గోకారం జలాశయం సామర్థ్యం తగ్గించాలి

చారకొండ: మండలంలోని గోకారం జలాశయం నిర్మాణ సామర్థ్యాన్ని తగ్గించాలని శుక్రవారం మండలంలోని చంద్రాయన్‌పల్లికి వచ్చిన ఎమ్మెల్యేలు కసిరెడ్డినారాయణ రెడ్డి, వంశీకృష్ణలను ముంపు గ్రామాలు ఎర్రవల్లి, ఎర్రవల్లి తండా గ్రామాల నిర్వాసితులు కలిశారు. అనంతరం వినతిపత్రం అందజేశారు.

భక్తిశ్రద్ధలతో బంగారు మైసమ్మ బోనాలు



ఊరేగింపుగా బోనాలతో వెళ్తున్న మహిళలు

తాడూరు: మండలంలోని సిర్సవాడలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో బంగారు మైసమ్మ బోనాలను నిర్వహించారు. గ్రామంలో పండుగ సందడి నెలకొంది. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. అంతకుముందు మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఆలయాన్ని వేపాకులు, విద్యుత్‌దీపాలతో అలంకరించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



వెల్దండ: మండలంలోని పోషమ్మగడ్డ తండాకు చెందిన డీలర్ భర్త తావుర్యానాయక్ అనారోగ్యంతో మృతి చెందాడు. శుక్రవారం మండల రేషన్ డీలర్ల సంఘం ఆధ్వర్యంలో డీలర్ గంప్లీని పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు జంగయ్య, ఆయా గ్రామాల డీలర్లు నరసింహ, బాలరాజు, చంద్రశేఖర్, వెంకటయ్య, జగదీశ్వర్, రవికుమార్, మల్లేష్, గణపతి, శ్రీనివాసులు, గోపాల్ తదితరులు ఉన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత



అవగాహన కల్పిస్తున్న కోనేరు సంస్థ సభ్యులు

లింగాల: బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని ఎంపీఓ సురేందర్ అన్నారు. మండలంలోని కోమటికుంటలో శుక్రవారం కోనేరు సంస్థ ఆధ్వర్యంలో బాలల హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీఓ మాట్లాడుతూ బాల్య వివాహాలు అరికట్టడం, పిల్లల అక్రమ రవాణా, పిల్లలపై లైంగిక వేధింపులు చట్ట విరుద్ధమన్నారు. పిల్లలను వ్యవసాయ పనులకు పంపవద్దని, బడిఈడు పిల్లలను పాఠశాలకు పంపించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో కోనేరు సంస్థ ఏరియా కో ఆర్డినేటర్ శ్రీనివాసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.